

# * శ్రీకృష్ణ తులాభారము

పారనంది జగన్నాథస్వామి గారు

(ఆంధ్రభాషావిమర్శనములకు ప్రత్యుత్తరము)

ఈ నాటకమును చాలామంది విద్వజ్జనులు మెచ్చుకొని యుండవచ్చును. అనేకస్థలములలో ప్రేక్షకులు ఆనందమగ్నులై యుండవచ్చును. ఈ సంగతిని నావ్యాసములో చెప్పేఉన్నాను; గ్రంథముపై ఇచ్చిన అభిప్రాయములవలననే స్పష్టమవుతున్నది. కాని వారిమెప్పు నావిమర్శనకు ప్రతిష్టంభకము కాదని నా అభిప్రాయము. గ్రంథములో లోపములుంటే ఎందుకు మెచ్చుకుంటారో, ఎందుకట్టి అభిప్రాయములు ఇస్తారో నేను చెప్పలేను. మెప్పులున్నవి కాబట్టి నావిమర్శన తప్పు కానేరదని నామనవి.

నావిమర్శన పూర్ణమైనది కాదని నేనే అంగీకరింతును. ఏవేవో విషయములు విమర్శనార్హములు ఉండిపోయినవట. నేను వ్రాసినదానికి నేను ఉత్తరవాదిని కాని విడిచిపెట్టిన దానికి కాను. వాటిని విడిచివేసినందుకు హేతువు లుండవచ్చు లేకపోవచ్చు. వాటితో ప్రసక్తి లేదు. అయినా ఖండనవాదులు ఆరోపించినంత వరకు అసంగతులను నేను విడిచివేయలేదు. కథాభివృద్ధి నేను పరీక్షించే ఉన్నాను. వివిధభాషలు నాకు నాటకములో కానరాలేదు; అంతా ఏకభాష, గ్రాంథికభాషే కదా. కాలగమనిక (Passing of time), రంగము, యనుక్రమణిక (Arrangement of the Scenes) అని అన్నవి, నాటకవిషయములా రంగవిషయములా? వీటిని నేను విమర్శించలేదు; ఇప్పుడు విమర్శిస్తే బాగుండదుకూడా.

నేను వ్యావహారిక భాషావాదినే. భాషాచర్చలోనికి నేను దిగలేదట. లోపము లున్నవని చూపించినానే. అంతకంటె ఎక్కువగా ఆచర్చ నాకు నచ్చక మానినాను. మరొకరు చేయవచ్చును. పెద్దపెద్ద పండితులే ఇప్పుడు ఆంధ్రభాషను సరిగా పూర్వపునియమముల ప్రకారము ఉపయోగించలేకున్నారని రావుసాహెబు గిడుగు రామమూర్తిపంతులవంటి పండితులు ప్రకటిస్తూ ఉంటే, మన కెందుకు తగాయిదా లని ఊరుకొన్నాను.

నాటకమునకు ప్రదర్శనధర్మము ముఖ్యమని నేనే చెప్పియుంటిని. ప్రదర్శనమునకు బాగాఉంటే పఠనీయగ్రంథమవుతుందా? సురభికంపెనీనాటకములే ప్రమాణములు. నాటకములు దృశ్యకావ్యములుకదా, అయితే దృశ్యమునకు బాగాఉన్నా, కావ్యముగాకూడా ఉండవద్దా? దృశ్యములకు పరీక్షాస్థలమైన రంగము కావ్యములకు కూడా అవుతుందా? దృశ్యములను మెచ్చుకొన్న ప్రేక్షకులు కావ్యమును కూడా మెచ్చుకొన్నట్లేనా? రసనిర్ణేతలు ఎవరు? ఈభేదముచేసే నేను నావ్యాసమును వ్రాసియుంటే దానిని ఉల్లంఘించి ఖండనవాదులు వాదిస్తే ఏలాగు? ఈసందర్భములో మనదేశీయుల (అనగా సంస్కృతకవుల) రూపకములను ఉదాహరణములుగా చెప్పవద్దు; వారి నియమములను మన మిప్పుడు పాటిస్తూ ఉండలేదు.

నావ్యాసమునుండి ఐదుసారాంశములు, తీసి వాటిపై ఖండనగా కొంత వ్రాసియున్నారు. ఆసారాంశములకు ప్రత్యుత్తరము ఆవరుసనే వ్రాస్తాను.

i "పురాణకథలుకల నాటకములు నాటకారంభదశను సూచించునని" యొకసిద్ధాంతమును నేను కల్లడి చేస్తున్నానట. ఈమాటలు నావ్యాసములో లేవు. నేను వ్రాసినది ఏమిటంటే "పాశ్చాత్యదేశమున నాటకారంభదశలో ఉద్భవించిన మహిమల నాటకములవంటివి మన

---

* దీనిని గురించిన విమర్శనల నిక ప్రకటింపజాలము.—సంపాదకుడు.

వాఙ్మయములో ఇప్పుడు రాజిల్లుచున్నవి. వాటినుండి నీతులు సంగ్రహించి ... నాటకమును మెచ్చుకొనే ప్రేక్షకులు పురాణయుగమును దాటినవారు కారుగదా" ఇవి నావాక్యములు.

ii ఖండనలో తీసిపెట్టిన సారాంశము నేనువేయలేదు. "గర్వభంజన కథకున్నూ, ఈలీలలు కథకున్నూ సంబంధము కానరాదు" అని నావాక్యము. సంబంధము ఇదా అదా అని ఊహించి వాటిని చర్చించి, "ఏదైనా డొంకతిరుగుడు సమాధానమే" అని వ్రాసినాను. దీనికి ప్రత్యుత్తరముగా "నాంది మొదలు మంగళమువరకు విమర్శిస్తే; నాటకము చక్కగా చదివితే" అని ఖండనకారులు ఆగ్రహించినారు. ఆతరువాత "ఏల ఈలీలల కథ" అని ప్రశ్నచేసి ఉపపత్తులు మూడుచెప్పేరు. రెండోదానిని, స్త్రీలోలత్వభ్రమనాశనమును, నేను చర్చించేను; నాప్రశ్నలకు సమాధానము చెప్పక, కృష్ణుడు స్త్రీలోలుడు కాడు, స్త్రీలోలుడుకాడు, అని ఘోషిస్తే ఉపపత్తి స్థిరపడునా? మొదటి మూడు ఉపపత్తుల ప్రకారము లీలలకు పూర్వము సత్యభామాహంకారము గురించి గాని కృష్ణుని మహిమగురించిగాని నారదునికి తెలియదని చెప్పవలసి వస్తుంది. అయితే నారదుని రాక యాదృచ్ఛికమా? శచీంద్రుల సంభాషణఫల మేమిటి? అదికాక లీలలో వ్యక్తమైనది సత్యభామ మాధ్యమా లేక అహంకారమా? కృష్ణునిసామాన్యమహిమా లేక కథతో సంబంధించిన మహిమా? ఈఉపపత్తులే నిలవవలెనంటే నాటకములోని కథారచన మారవలెను. అవి చక్కగాసూచన కావలసి ఉంటుంది.

iii. ఈశ్వరగుణములను మనుష్యస్వభావముతో మేళనచేయుటవలన నాటకములో కనబడే దోషముల గురించి నేను వ్రాసిఉంటే, గీతాశ్లోకములు వ్రాసి కృష్ణుడు ఈశ్వరుడే అని రుజువుచేయుట ఎందుకు? కృష్ణుడు లీలామానుషస్వరూపుడు అని ఎందవార్లు నాటకములో ఉంటే నేనుచూపిన రచనదోషములు ఎట్లా పరిహరింపబడును?

iv కృష్ణుని కోపకారణము ఏమిటి అని నేను ప్రత్యేకముగా చర్చింపలేదే. అది ఒకముఖ్యాంశముగా కూడా నేను వ్యాసములో వ్రాయలేదే. ఆకారణము భామనిరాకరణమని నేను వ్రాశేను. అదికాదట రుక్మిణి ఇంటికి వెళ్లకూడదని భామచేసిన నిర్బంధములు. అలాగు ఎక్కడ ఉంది? మొదటి అంకము కథంతా భామనిరాకరణము; నిరాకరణమప్పుడే కోపంవచ్చింది. అయితే కారణమేమై ఉంటుందో కదా!

v ఇందులో సారాంశమేమీలేదే. నాకేమో నాలుగుసంగతులు గోచరము కాలేదట. మొదటిది కృష్ణుని ఈశ్వరాంశము; అది లేదని నేను అనలేదు. దానితో మనుష్యస్వభావము మేళనము చేయుటచేత వచ్చినచిక్కు చూపించేను. రెండోది భక్తి; నేనూ అన్నదే. చూ. ౩౨, ౩౩ పుట. మూడోదానిగురించి నేను వాదించలేదే. దానితో నాకు ప్రసక్తిలేదు. నాల్గోది నారదుని శీలముగురించి. నేను వ్రాసిన ఒక్కవాక్యములోను నారదునిభక్తి మాటఉన్నదే. చూ. ౩౧ పుట; అంతకంటె ప్రత్యేకముగా నారదుని ప్రయోజనము గురించి నేను చర్చించలేదు. ఇవి నాకు గోచరము కాలేదన్నమాట ఏమిమాట. ఖండనకారులు చెప్పినవర్ణనలు పురాణములోకూడా ఉంటవికదా; అవి కేవలము నాటక ప్రాశస్త్యమునకు ఎట్లు హేతువులగునో తెలియదు. ఈలాగే మరొకసంగతి ఉన్నది. గుణపరిశీలనము నావిమర్శనావరణములోనికి రాలేదని వ్రాసినారు. దానిగురించి చర్చచేసి ఉన్నాను; చూ ౩౧ పుట.

ఏమి అవస్థ అని నేను అనవలసివచ్చింది. నేనేవో కొన్నిలోపములు చూపించేనని ఆగ్రహించి, నేను చేసిన వ్యాఖ్యానమును మరిచి నాపై ఉన్నవి లేనివి కలిపి ఖండనవ్రాయుట, ఖండనముదట వ్రాసిన ఉపదేశమునకు సరిపడినదా అని నేను అడుగుతున్నాను. విమర్శన చేయుటలో నాకేమి గ్రంథకర్తగారితో తగాయిదాలేదు. వారిని నేను ఎరుగను. గ్రంథములో ఒక చక్కని అంశము ఉండుటచేతనే దానిపై ఆవ్యాసము వ్రాసేను. "పరిశోధిత ద్వితీయముద్రణమునకు" నా వ్యాసము కొంత సహకారియై ఉంటే నావ్యాసము యొక్క ప్రయోజనము తీరినట్లే.

నావ్యాసముపై చేసిన ఖండనకే నేను ప్రత్యుత్తరము ఇచ్చేను. మిగిలిన అంశములు విడిచివేసేను. ఈ ప్రత్యుత్తరము వ్రాయుటకు కూడా నాకు ఇష్టములేదు. నాకు వ్యక్తితో సంబంధము లేనప్పుడు నా అభిప్రాయము వ్యక్తపరుచుటతో నాపని ముగిసినదని నేను ఉపేక్షిస్తే నామిత్రులు దీనిని వ్రాయక తీరదని అభిప్రాయపడుటచేత ఈ మాత్రమైనా వ్రాయవలసి వచ్చింది. నేనే వ్రాయుట సమంజసమని వారువ్రాస్తామన్నా నేను ఇష్టపడలేదు. గ్రంథపరీక్షతోనే ప్రసక్తిగాని అహంకారముతో కాదని మనవిచేస్తున్నాను.